


శ్రీకాకుళం పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడిగా కలమట

శ్రీకాకుళం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడిగా కలమట వెంకటరమణ నియమితులయ్యారు. ఈమేరకు టీడీపీ రాష్ట్ర కార్యాలయం నుంచి మాజీముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు.. బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు.



శ్రీకాకుళంలో సమావేశానికి భారీగా హాజరైన మహిళలు

ఆడబిడ్డలూ.. అధైర్యపడొద్దు

ప్రసంగిస్తున్న చంద్రబాబు

- మిమ్మల్ని మహాశక్తివంతులుగా తీర్చిదిద్దుతాం
- మే 13న అదిరిపోయే తీర్పునివ్వాలి
- వైసీపీని ఓడించి.. సైకో జగన్‌ను తరిమికొట్టాలి
- మీ ఆర్థికాభివృద్ధికి నాదీ బాధ్యత
- మహిళల సమావేశంలో చంద్రబాబు భరోసా
- టీడీపీ అధినేతకు సమస్యలు విన్నవించిన మహిళలు



చంద్రబాబుతో శ్రీకాకుళం ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు రామ్మోహన్, గొండు శంకర్

శ్రీకాకుళం,ఆంధ్రజ్యోతి/ అరసవల్లి, ఏప్రిల్ 24: 'మీరంతా నా ఆడబిడ్డలు. మీ అందరికీ పుట్టిల్లు టీడీపీయే. మిమ్మల్ని మహాశక్తి వంతులుగా తీర్చిదిద్దుతా. ఆర్థికంగా అభివృద్ధి చేస్తా'నని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబునాయుడు మహిళలకు భరోసా ఇచ్చారు. బుధవారం శ్రీకాకుళంలోని ఎన్టీఆర్ మునిసిపల్ హైస్కూల్ మైదానంలో జిల్లా మహిళలతో ఆయన సమావేశమయ్యారు. వైసీపీ పాలనలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రస్తావించారు. అసమర్థ ప్రభుత్వం కారణంగా ప్రజల జీవితాలు తలకిందులయ్యాయని ఆరోపించారు. వైసీపీ నేతల తీరును ఎండగడుతూ.. 'ఏ ఒక్కరూ అధైర్యపడొద్దు. అండగా ఉంటా. మీ ఆర్థికాభివృద్ధికి నాదీ బాధ్యత' అని మహిళలకు చంద్రబాబు భరోసా ఇచ్చారు. మే 13న అదిరిపోయే తీర్పునివ్వాలని.. వైసీపీ నేతలను ఓడించి.. సైకో జగన్‌ను సాగనంపాలని పిలుపునిచ్చారు.

వారిద్దరూ రాష్ట్రానికి, జిల్లాకు పట్టిన కేన్సర్..

'వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలూ ఇబ్బందులు పడ్డారు. కుటుంబ ఖర్చులకు తగ్గ ఆదాయం పెరగలేదు. పైగా.. రూ.10 ఇచ్చి తెలివిగా రూ.100 నొక్కేస్తున్నాడు సీఎం జగన్. రాష్ట్రానికి పట్టిన కేన్సర్ జలగ జగన్. శ్రీకాకుళం జిల్లాకు పట్టిన కేన్సర్ ధర్మాన ప్రసాదరావు. ఆయన ఇంటిపేరులో ధర్మం ఉంది.. కానీ ఆయన పనులన్నీ అధర్మమే. అధర్మానను ఇంటికి పంపించాలి. శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడును, ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్‌ను ఆశీర్వదించి గెలిపించాలి. ఎర్రన్న స్ఫూర్తిని కొనసాగిస్తూ.. రామ్మోహన్‌నాయుడు ఉత్తరాంధ్ర ముద్దుబిడ్డగా, అసాధారణ వ్యక్తిగా ఎదిగాడు. ఆయన ఢిల్లీలో గళం విప్పితే తిరుగులేదు. నాకు డౌట్‌లేదు. ఎన్నిక లాంఛనమే. మంచి మెజార్టీతో ఆశీర్వదించాలి. గొండు శంకర్ ఓ సాధారణ కార్యకర్త. యువకుడు. మీ అందరి అభిప్రాయాలను అడిగాను. ఈ రోజు ఉదయం గుండ లక్ష్మీ దేవి, సూర్యనారాయణతో మాట్లాడాను. వారు కూడా చాన్నాళ్ల పాటు పార్టీకి సేవలందించారు. ఎన్ని ఇబ్బందులున్నా గెలుపే నిర్ణయంగా తీసుకున్నాను. మీ నోట్లో నాలుకగా తయారైన వ్యక్తి కావాలన్నదే శంకర్‌ను తయారుచేశాను. మీరు ఆదరించి గెలిపించాలి' అని చంద్రబాబు కోరారు.

లక్షాధికారులను చేస్తాం

'మగవారి కంటే ఆడబిడ్డలు తెలివైనవారు. అందుకే ఆనాడు ఇళ్లు, పట్టాలు మీ పేరున ఇచ్చారు. ఈసారి సూపర్ పవర్‌గా మిమ్మల్ని తయారుచేయాలనే నాలుగు కార్యక్రమాలతో ఇక్కడకు వచ్చాను. నేను ఆంక్షలు పెట్టను. అమ్మకు వందనం పథకం కింద ఎంతమంది పిల్లలు ఉంటే వాళ్లందరికీ రూ.15వేలు చొప్పున ఇస్తాను. మా ఆడబిడ్డలను లక్షాధికారులను చేస్తాం. ప్రతి ఏడాది మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తాను. అలాగే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తాం. ఏప్రిల్ నుంచి పింఛన్ రూ.4వేలకు పెంచుతాను. జూలైలో ఇచ్చే పింఛన్లను.. ఏప్రిల్‌తో కలిపి అందజేస్తాను. వికలాంగులకు రూ.6వేలు ఇస్తాను. ఈ ఎన్నికల్లో వైసీపీ ఇచ్చే రూ.2వేలకు ఆశపడొద్దని హెచ్చరిస్తున్నా. పాతపట్నంలో పనులు చేస్తున్న ఉపాధిహామీ కూలీలు నావద్దకు వచ్చి వారి కష్టాలు చెప్పుకొచ్చారు. వాళ్లందరికీ న్యాయం చేస్తామ'ని చంద్రబాబు తెలిపారు.

జిల్లాకు ఇవీ చేస్తాం

'జిల్లాలో మినీ జెట్టీలను ఏర్పాటుచేస్తాం. మత్స్యకారులను ఆదుకుంటాం. స్టేడియం కడతాం. పాలకొండ రోడ్డు.. ఔటర్ రింగు రోడ్డు పెండింగ్ ఉంది. శ్రీకాకుళంలో అండర్‌గ్రౌండ్ సమస్య ఉంది. టీడీపీ హయాంలోనే శ్రీకాకుళం అభివృద్ధి అయింది. శ్రీకాకుళాన్ని మోడల్ టౌన్‌గా మార్పుచేయాలన్నదే నా ఆలోచన. జిల్లాలో వలసలు నివారించి.. తలసరి ఆదాయం పెంచుతాం. ఎక్కువగా డిఫెన్స్‌లో ఉండే త్యాగాల జిల్లా ఇది. మీ బంగారు భవిష్యత్తు కోసం కలసివచ్చాం. మెగా డీఎస్సీ పెడతాం. ఐదేళ్లలో 20 లక్షలు ఉద్యోగాలిస్తాం. అన్న క్యాంటీన్‌లను పునరుద్ధరిస్తాం. యువత ఇంటివద్దనే పని చేసుకునేలా సౌకర్యం కల్పిస్తామ'ని చంద్రబాబు హామీ ఇచ్చారు. సమావేశంలో ప్రసంగం అనంతరం ఓ తల్లి.. నెలన్నర వయసున్న తన చిన్నారిని చంద్రబాబు వద్దకు తీసుకువచ్చి పేరు పెట్టమంది. దీంతో ఆ చిన్నారికి పునర్విక అని పేరు పెడుతూ.. చంద్రబాబు పిలిచారు.



చిన్నారికి.. నామకరణం చేస్తున్న చంద్రబాబు

పింఛన్ చాలడం లేదు



నేను వితంతువుని. నాకు ఇచ్చే పింఛన్ రూ.3వేలు ఖర్చులకు చాలడం లేదు. అందులోనే చెత్తపన్నుకి, కరెంట్ బిల్లుకు పోతుంది. గతంలో 35 కిలోలు బియ్యం మీరు ఇచ్చేవారు. మీవల్లనే మేం బాగుపడ్డా. చిన్నప్పుడు మా పిల్లలకు సైకిల్ తొక్కించాం. ఇప్పుడు మీరు వస్తేనే బాగుంటుంది. మీకోసం అందరూ సైకిల్ తొక్కేలా చేస్తాం.

-అలబాన జయలక్ష్మి, హయతీనగర్

● చంద్రబాబు : మోదీ ఆహారభద్రత కింద మనిషికి ఐదు కిలోల బియ్యం ఇస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం ఇవ్వడంలేదు. పండగలకు కానుకలు ఇచ్చేవాళ్లం. అవేవీలేవు. అధికారంలోకి వచ్చాక పేదవారికి ఖర్చులు తగ్గిస్తా. మెరుగైన స్టాండర్డ్ ఇచ్చే బాధ్యత నాది.

డీఎస్సీ లేదు



నేను బీఈడీ చేశాను. నాలుగేళ్లలో ఒక్క డీఎస్సీ రాక గృహిణిగా ఉండిపోయాను. మళ్లీ డీఎస్సీ ప్రకటిస్తే జాబ్ కోసం పనిచేస్తాను. నాకు ఉద్యోగం చేయాలని ఉంది.

-కుమారి, బీఈడీ

● చంద్రబాబు: తప్పకుండా తొలిసంతకం మెగా డీఎస్సీపైనే. నీ లక్ష్యం నెరవేరాలి. ఇప్పటినుంచే ప్రిపేర్ కావాలి.

ఉపాధి లేకుండా పోయింది



మీరు పెట్టిన భిక్ష మాది సార్. ఆనాడు చిన్నపునాది వేశారు. మహిళా సాధికారిత కోసం మమ్మల్ని మార్గదర్శిగా చేశారు. 2000లో సంఘం పెట్టుకుని.. సీఆర్పీలుగా మారి ఇతర రాష్ట్రాల్లో శిక్షణ ఇచ్చేవాళ్లం. ఈ ప్రభుత్వంలో మహిళలు ఇతర రాష్ట్రాలకు వెళ్లే ట్రైనింగ్‌ను రద్దుచేశారు. దీంతో ఉపాధి లేకుండా పోయంది. మీరు వచ్చాక మహిళా సాధికారిత వస్తుంది. మేం భయం లేకుండా తిరగాలి. బంపర్ మెజార్టీతో మిమ్మల్ని గెలిపించుకుంటాం సార్.

-దేవకన్య, డ్వాక్రాసంఘ సభ్యురాలు

● చంద్రబాబు: ఇక్కడున్న రాజకీయ నాయకులకంటే ఆమె చాలా బాగా మాట్లాడారు. అది నేను నేర్పించిన నమ్మకం. ఆనాడు డ్వాక్రా సంఘాల్లో మోటివేటర్లుగా ఇతర రాష్ట్రాల్లో శిక్షణ ఇచ్చేవారంటే అదీ మన ఘనత. ఇక్కడ తయారుచేసిన వస్తువులను విదేశాల్లో మార్కెట్ చేశారు. డ్వాక్రా బజార్‌లు నిర్వీర్యం అయిపోయాయి ఇప్పుడు. ఈరోజు హామీ ఇస్తున్నా. నేను ఇచ్చే 1500 ఆర్థిక సహాయం కాకుండా రూ. 10లక్షలు వడ్డీలేని రుణం అందజేస్తాను.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో తీవ్ర నష్టం



మహిళలకు ఉన్న ఆస్తులకు గురించి చెప్పారు కానీ.. ప్రస్తుతం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ వల్ల మహిళలకు తీవ్ర నష్టం జరుగుతుంది. మేం అత్తవారి ఇంట్లో ఉంటాం. మా హక్కులను కాలరాస్తున్నారు. మీరు ఈ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతున్నా.

-విజయలక్ష్మి, మహిళా న్యాయవాది

● చంద్రబాబు: ఏపీ టైట్లింగ్ యాక్ట్‌ను వైసీపీ తీసుకువచ్చింది. జగన్‌కు విచిత్రమైన ధోరణిలు ఉన్నాయి. ఎవరూ చేయని విధంగా వంశపారంపర్యంగా లభించిన ఆస్తికి సీఎం ఫొటోలు వేసుకుంటున్నాడు. పాస్‌బుక్‌లు, అడంగల్ అనేవి గతంలో ఉన్నాయి. ఇప్పుడు ఈ సీఎం అవన్నీ తీసేసి మీ ఆస్తులకు రికార్డులు లేకుండా చేసి ఆన్‌లైన్‌లో పెట్టుకుంటాడంట. మీ భూమిని వేరేవారి పేరుతో ట్రాన్స్‌ఫర్ చేస్తాడు. ఇదే జరిగితే ఆస్తులకు శఠగోపం పెట్టినట్లు అవుతుంది. ఇప్పటికే వాళ్ల మనుషులతో ఆస్తులను కొట్టేస్తున్నారు. మేం అధికారంలోకి వస్తే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తాం.



టెక్కలిలో హైవేపై నిలిచిన వాహనాలు

ఆంక్షలు.. అవస్థలు

- టెక్కలిలో ముగిసిన సీఎం 'సిద్ధం' సభ
- ఎక్కడికక్కడ ట్రాఫిక్ ఇక్కట్లు
- జగన్ ప్రసంగం ముగియకుండానే వెనుదిరిగిన ప్రజలు
- అప్రోచ్‌రోడ్డు డివైడర్ ఎక్కిన సిద్ధం ఆర్టీసీ బస్సు.. తప్పిన పెను ప్రమాదం

టెక్కలి, ఏప్రిల్ 24: ప్రజలకు ఎన్నో ఆంక్షలు.. ఎన్నెన్నో అవస్థలు నడుమ సీఎం జగన్ పర్యటన సాగింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం టెక్కలిలో సీఎం జగన్ నిర్వహించిన 'సిద్ధం' ముగింపు సభ కారణంగా సామాన్య ప్రజలు ఇక్కట్లు పడ్డారు. టెక్కలిలో హైవేపై గంటన్నరకుపైగా ట్రాఫిక్ ఆంక్షలు నెలకొన్నాయి. సీఎం సాయంత్రం 4.10గంటలకు పరశురాంపురం జంక్షన్‌కు బయలుదేరగానే.. పరశురాంపురం నుంచి కోటబొమ్మాళి వరకు లారీలను, బస్సులు, ఇతర వాహనాలు నిలిపివేశారు. అక్కవరం నుంచి జగతిమెట్ట, ఆదిఆంధ్రావీధి, టెక్కలి శివారు ప్రాంతం నుంచి నందిగాం మండల పరిధి వరకు వాహనాలు బారులుతీరాయి. సాయంత్రం 5.40గంటల వరకు ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు.

● సీఎం సభకు వజ్రపుకొత్తూరు మండలం బెండిసీతాపురం నుంచి జనాన్ని తీసుకువచ్చిన వాల్తేరు డిపో బస్సు అప్రోచ్‌రోడ్డు డివైడర్ ఎక్కి ఇరుక్కుపోయింది. దీంతో బస్సులో ఉన్న జనం ఉలిక్కిపడ్డారు. నెమ్మదిగా ఆగిన బస్సు నుంచి కిందకు దిగి ఊపిరి పీల్చుకున్నారు.

● సీఎం జగన్ రాగానే.. సభ లోపలకు వెళ్లేందుకు కొంతమంది ప్రయత్నించగా తొక్కిసలాట జరిగింది. పోలీసులు బారికేడ్లు పెట్టి అడ్డుకున్నారు. టెక్కలి సర్పంచ్ గొండేల సుజాతను పోలీసులు లోపలకు అనుమతించలేదు. డయాస్‌పాస్ ఉన్నా.. తనను ఎందుకు అడ్డుకుంటున్నారని సుజాత పోలీసులను ప్రశ్నించారు.

● సభలో సీఎం మాట్లాడుతుండగానే పెద్దఎత్తున ప్రజలు వెనుదిరిగారు. పలువురు వలంటీర్లు.. సభలో మాస్క్‌లు, టోపీలు పంపిణీ చేశారు. అలాగే టెక్కలిలో మద్యం షాపుల వద్ద వైసీపీ కార్యకర్తలు బారులుదీరుతూ కనిపించారు.



హైవేపై నిలిచిన ట్రాఫిక్

శ్రీకాకుళం అర్బన్: సీఎం జగన్ బస్సుయాత్ర అక్కివలస నుంచి ప్రారంభమై.. జాతీయ రహదారి మీదుగా టెక్కలి వరకూ సాగింది. ఆంక్షలు కారణంగా ఎచ్చెర్ల మండలం చిలకపాలెం నుంచి శ్రీకాకుళం కొత్తరోడ్డు వరకు రెండున్నర గంటలపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. కొత్తరోడ్డు సమీపంలోని గోపీనగర్ వద్ద సీఎంను కలిసేందుకు ప్రజలు, వైసీపీ శ్రేణులు రాగా.. పోలీసులు అదుపు చేయడంతో కాస్త గందరగోళం నెలకొంది. సీఎంను కలిసేందుకు బొందిలీపురం వైసీపీ నేత ఎండ రమేష్ ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వాగ్వాదం జరగ్గా.. శ్రీకాకుళం సీఐ ఎల్.సన్యాసినాయుడు పరిస్థితిని చక్కదిద్దారు.



బస్సులు లేక ఇక్కట్లు

పలాస: సీఎం సభకు ఆర్టీసీ బస్సులన్నీ తరలించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పలాస-కాశీబుగ్గ కాంప్లెక్స్‌లో గురువారం వేకువ జామున 4.30 గంటల నుంచి బస్సుల కోసం ప్రయాణికులు నిరీక్షించగా.. ఏడు గంటలైనా రాలేదు. దీంతో ఒడిశా ఆర్టీసీ, ప్రైవేటు బస్సులను ఆశ్రయించారు.



విలవిల్లాడిన మహిళలు

నరసన్నపేట: మడపాం టోల్‌ప్లాజా వద్దకు సీఎం జగన్ బుధవారం మధ్యాహ్నం 12.20 గంటలకు చేరుకున్నారు. స్వాగతం పలికేందుకు స్థానిక నాయకులు ఉదయం 10 గంటలకే మహిళలను తీసుకురాగా వారంతా ఎండలో ఇబ్బంది పడ్డారు. పోలీసులు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద కొంత మంది మహిళలు నీడలో సేదదీరారు. దేవాది నుంచి తామరాపల్లి వరకు సీఎం కాన్వాయ్ వెళ్లగా.. ఆ సమయంలో జగన్‌ను చూసేందుకు రోడ్ల మీద ప్రజలు లేకపోవడం గమనార్హం.

నామినేషన్ల హోరు

కలెక్టరేట్/ ఇచ్ఛాపురం/ రణస్థలం, ఏప్రిల్ 24: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి.. జిల్లాలో నామినేషన్ల హోరు కొనసాగుతోంది. బుధవారం శ్రీకాకుళంలో పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి టీడీపీ అభ్యర్థి ఎంపీ రామ్మోహన్‌నాయుడు నామినేషన్ వేశారు. కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి మన్‌జీర్ జిలానీ సమూన్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, టీడీపీ జిల్లా నూతన అధ్యక్షుడు కలమట వెంకటరమణ, మాజీ ఎమ్మెల్యే గౌతు శ్యామ సుందర శివాజీ, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు పాల్గొన్నారు. అలాగే అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి.. ఇచ్ఛాపురంలో టీడీపీ అభ్యర్థి బెందాళం అశోక్ నామినేషన్ వేశారు. రిటర్నింగ్ అధికారి కె.సుదర్శన్‌దొరకు అశోక్ రెండు సెట్లు, ఆయన సతీమణి బెందాళం నిలోత్పల ఒక నామినేషన్ సెట్ అందజేశారు. ఎచ్చెర్ల నియోజకవర్గానికి సంబంధించి కూటమి తరపున బీజేపీ అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు నామినేషన్ వేశారు. అలాగే వైసీపీ, కాంగ్రెస్, ఇతర పార్టీల అభ్యర్థులు కూడా పలువుర్లు నామినేషన్లు వేశారు.



కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు



ఇచ్ఛాపురం: ఎమ్మెల్యే అశోక్ నామినేషన్...



రణస్థలం: ఎన్ఈఆర్ నామినేషన్

మంత్రి ధర్మానపై ఆరు కేసులు

శ్రీకాకుళం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మంత్రి ధర్మాన ప్రసాదరావుపై ఆరు కేసులు ఉన్నట్టు ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించారు. శ్రీకాకుళం వైసీపీ అసెంబ్లీ అభ్యర్థిగా ధర్మాన ప్రసాదరావు బుధవారం నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా తనపై మూడు ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసులు, మూడు సీబీఐ కేసులు ఉన్నట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించినందుకు శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఒకటి, శ్రీకాకుళం రూరల్ పోలీసు స్టేషన్లో రెండు కేసులు ఉన్నాయి. అలాగే 2011 ఆగస్టు 17న సీబీఐ నమోదు చేసిన మూడు కేసులున్నాయని వివరించారు.

ఆస్తులివీ: ధర్మాన ప్రసాదరావు వద్ద ప్రస్తుతం చేతిలో రూ.18.40 లక్షలు, సతీమణి గజలక్ష్మి వద్ద రూ.4.70 లక్షలు ఉన్నాయి. 20.68 ఎకరాల వ్యవసాయ భూమి ధర్మాన పేరుతో ఉంది. తెలంగాణ రాష్ట్రంలో ధర్మాన దంపతుల పేరిట అపార్ట్‌మెంట్‌లు ఉన్నాయి. మొత్తం చరాస్తి ధర్మాన పేరిట రూ.6.06కోట్లు, భార్య పేరిట రూ.5.87 కోట్లు, స్థిరాస్తులు ధర్మాన పేరిట రూ.9.58 కోట్లు, భార్య పేరిట రూ.3.43కోట్లు విలువగలవి ఉన్నాయి.

జన కేతనం



సిక్కోలు సింహం ఎవరో?

- టీడీపీ కంచుకోటగా శ్రీకాకుళం ● ఆరుసార్లు పార్టీ అభ్యర్థులు గెలుపు
- మూడుసార్లు కాంగ్రెస్, ఒకసారి వైసీపీకి పట్టం ● విలక్షణ తీర్పు ఇస్తున్న ఓటర్లు
- ఈసారి ధర్మానను ఢీకొడుతున్న యువనేత గొండు ● ప్రచారంలో దూసుకుపోతున్న శంకర్
- వెంట వస్తోన్న గుండ వర్గం ● వైసీపీ పాలనపై ప్రజల్లో అసంతృప్తి



టీడీపీ అంటే సిక్కోలు.. సిక్కోలు అంటే టీడీపీ అనేలా శ్రీకాకుళం నియోజకవర్గం ఆ పార్టీకి కంచుకోటగా మారింది. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో ఆరుసార్లు టీడీపీ అభ్యర్థులు గెలుపుబావుటా ఎగురవేయడమే దీనికి నిదర్శనం. పార్టీ ఆవిర్భావం తరువాత వరుసగా ఐదుసార్లు టీడీపీ అభ్యర్థులకు పట్టం కట్టారంటే ప్రజల గుండెల్లో ఎంత నాటుకుపోయిందో అర్థం చేసుకోవచ్చు. నియోజవర్గం ఏర్పడిన తరువాత కేవలం మూడుసార్లు మాత్రమే కాంగ్రెస్ గెలిచింది. ఒకసారి వైసీపీకి అధికారం ఇచ్చారు ప్రజలు. శ్రీకాకుళం టీడీపీ అంటే ఠక్కున గుర్తుకు వచ్చేది గుండ కుటుంబమే. ఆ కుటుంబాన్ని అంతలా ఆదరించారు ఇక్కడి ఓటర్లు. అయితే, ఈసారి మారిన రాజకీయ సమీకరణాల దృష్ట్యా లక్ష్మీదేవికి బదులు యువనేత గొండు శంకర్‌కు టీడీపీ టికెట్ దక్కింది. దీంతో ప్రచారంలో దూసుకుపోతున్నారు. వైసీపీ అభ్యర్థి, మంత్రి ధర్మాన ప్రసాదరావును ఢీకొట్టబోతున్నారు. అమాత్యున్ని ఓడించేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. చూడాలి మరి ప్రజలు ఎవరికి పట్టం కడతారో.



గుండ అప్పలసూర్యనారాయణ | గుండ లక్ష్మీదేవి | గొండు శంకర్ | ధర్మాన ప్రసాదరావు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

శ్రీకాకుళం నియోజకవర్గంలో ఇప్పటివరకు ఆరుసార్లు టీడీపీ జెండా ఎగిరింది. పార్టీ ఆవిర్భావం తర్వాత జరిగిన ఎన్నికల్లో కేవలం మూడుసార్లు మాత్రమే టీడీపీయేతర పార్టీలు విజయం సాధించాయి. నియోజకవర్గం ఏర్పడిన తర్వాత 15 సార్లు ఎన్నికలు జరగ్గా కేవలం మూడుసార్లు మాత్రమే ఇక్కడి నుంచి కాంగ్రెస్ గెలుపొందింది. ప్రజలు ఆది నుంచి కాంగ్రెస్సేతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు పట్టంకడుతున్నారు. టీడీపీకి సంప్రదాయ ఓటు, పార్టీ విధానాలపై ఆకర్షితులైన ఓటర్లు ఉండడంతో ఆవిర్భావం నుంచి కంచుకోటగా మారింది. వరుసగా ఐదుసార్లు టీడీపీ అభ్యర్థులను గెలిపించారు. ఈసారి జరిగే ఎన్నికల్లో శ్రీకాకుళం ఓటర్లు టీడీపీని గెలిపించి సంప్రదాయం కొనసాగిస్తారని విభిన్న వర్గాలు చెబుతున్నాయి.

ఇదీ నియోజకవర్గం పరిధి..

శ్రీకాకుళం నగరపాలకసంస్థ, రూరల్, గార మండలాలు కలిపి 1952లో నియోజకవర్గంగా ఏర్పాటుచేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో శ్రీకాకుళం ద్విసభ్య నియోజకవర్గంగా ఉండేది. ఆ నియోజకవర్గానికి మొదటి శాసనసభ్యులుగా కావలి నారాయణ, కిల్లి అప్పలనాయుడు వ్యవహరించారు. తర్వాత కాలంలో దేశవ్యాప్తంగా ద్విసభ్య నియోజకవర్గాలను రద్దు చేయడంతో ఇక్కడ కూడా ఒకే నియోజకవర్గంగా మారింది. ఇక్కడ గార, శ్రీకాకుళం రూరల్ మండలాల్లో వెలమ సామాజికవర్గం ఎక్కువగా ఉన్నా, నగర పరిధిలో విభిన్న సామాజిక వర్గాలు ఉంటున్నాయి.

మహిళా ఓటర్లే కీలకం..

నియోజకవర్గం పరిధిలోని శ్రీకాకుళం అర్బన్‌లో 1,17,320 మంది, రూరల్‌లో 69,812 మంది, గార మండలంలో 75,017 మంది కలిపి మొత్తం 2,62,149 మంది జనాభా నివసిస్తోంది. ఇందులో ఎస్సీలు 19,438 కాగా ఎస్టీలు 1,009 మంది మాత్రమే ఉన్నారు. నియోజకవర్గం పరిధిలో మొత్తం 2,71,079 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,34,177 మంది పురుషులు, 1,36,871 మంది మహిళలు, 31 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. పురుషుల కంటే 1694 ఓటర్లు మహిళలే అధికంగా ఉన్నారు. దీంతో వారే అభ్యర్థుల గెలుపులో కీలకం కానున్నారు. అలాగే శ్రీకాకుళం అర్బన్‌లో 139, రూరల్ మండలంలో 66, గార మండలంలో 75 కలిపి మొత్తం 279 పోలింగ్ కేంద్రాలు ఎన్నికల నిర్వహణకు ఏర్పాటు చేస్తున్నారు. నియోజకవర్గంలో 97 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను అధికారులు గుర్తించారు.

'గుండ' కుటుంబానికే ప్రాధాన్యం..

నియోజకవర్గం 1952లో ఏర్పడిన తర్వాత ఎక్కువ కాంగ్రెస్సేతర పార్టీలకే ఇక్కడి ఓటర్లు పట్టం కట్టారు. 1983లో టీడీపీ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీకి కంచుకోటగా మారిపోయింది. 1983లో టీడీపీ తరఫున తంగి సత్యనారాయణ గెలుపొందారు. ఆ తర్వాత వరుసగా నాలుగుసార్లు 1985, 1989, 1994, 1999లో గుండ అప్పలసూర్యనారాయణ విజయం సాధించారు. 2014లో టీడీపీ తరఫున అప్పలసూర్యనారాయణ సతీమణి లక్ష్మీదేవి విజయం సాధించారు. దీంతో గుండ కుటుంబానికి ఐదుసార్లు ప్రజలు పట్టంకట్టినట్లు అయింది. అప్పటివరకూ నరసన్నపేటలో పోటీ చేస్తున్న ధర్మాన ప్రసాదరావు అక్కడ తన సోదరుడు కృష్ణదాసును బరిలో దింపి ఆయన శ్రీకాకుళంలో పోటీచేశారు. ప్రసాదరావు 2004-14 వరకు రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి క్యాబినెట్‌లో కీలకమైన రెవెన్యూశాఖను నిర్వహించారు. 2014లో లక్ష్మీదేవి చేతిలో ధర్మాన ఓటమి పాలయ్యారు. తిరిగి 2019లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. సీఎం జగన్ సారథ్యంలో రెండో క్యాబినెట్ విస్తరణలో భాగంగా రెవెన్యూశాఖను ధర్మానకు అప్పగించారు. ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న గుండ లక్ష్మీదేవిని కాదని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఉన్న గొండు శంకర్‌కు టీడీపీ అధిష్ఠానం టికెట్ ఖరారు చేసింది. వైసీపీ తరఫున మంత్రి ధర్మాన ప్రసాదరావు పోటీపడనున్నారు.

గొండు వెంట గుండ వర్గం..

అసెంబ్లీ టికెట్‌ను లక్ష్మీదేవికి బదులు గొండు శంకర్‌కు ఇవ్వడంతో గుండ దంపతులు క్రియాశీలక రాజకీయాలకు దూరమయ్యారు. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన చంద్రబాబును వారి కలిశారు. అనంతరం క్రియాశీలక రాజకీయాల నుంచి తప్పుకున్నట్టు ప్రకటించారు. దీంతో ఇన్నాళ్లు వారి వెంటే నడిచిన కేడర్, ప్రస్తుతం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ వెంట నడుస్తోంది.

వైసీపీ పాలనపై విసిగిన ప్రజలు..

ధర్మాన ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీకాకుళం నియోజకవర్గంలో ఎంతో కీలకమైన పనులను పూర్తి చేయడంలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు విస్తరణ, కోడిరామ్మూర్తి స్టేడియం, ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవనం తదితర పనులను గాలికొదిలేసింది. అధికారం చేపట్టి ఐదేళ్లవుతున్నా పనులను పూర్తిచేయకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. కనీసం శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు బాగు చేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇవన్నీ వైసీపీకి ప్రతికూలంగా మారాయి. ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటుతో ప్రజలు బుద్ధి చెప్పే అవకాశం ఉంది.

శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గానికి ఎన్నికల అధికారులు..

సీహెచ్ రంగయ్య	ఆర్డీవో (ఆర్వో/ ఈఆర్వో), శ్రీకాకుళం	9573356699
బీవీ రాణి	తహసీల్దార్ (ఏఈఆర్వో), శ్రీకాకుళం	8333909659
ఎం శ్రీను	తహసీల్దార్ (ఏఈఆర్వో), గార	8333988760

కులాల వారీగా ఓటర్ల వివరాలు..

కులం	ఓటర్లు
వెలమలు	38,796
కాపు/తెలగ, ఒంటరి	6,137
కళింగ	12,231
ఎస్సీ	15,800
జెల్ల/పల్లి/గండ్ల	11,571
యాదవలు	10446
ఎస్టీ	931
వైశ్యులు	11,955
బలిజలు	6,824
శ్రీశయన	8,955
ఒడ్డెర	1,709
రజక	3,934
దేవాంగ	3,219
ఇతరులు	29,194

ఇప్పటివరకు శ్రీకాకుళం శాసనసభ సభ్యులు

సంవత్సరం	సభ్యుడు	రాజకీయ పార్టీ
1952	కావలి నారాయణ	కేఎల్‌పీ
1952	కిల్లి అప్పలనాయుడు	కృషికర్ లోక్‌పార్టీ
1955	పసగడ సూర్యనారాయణ	ఇండిపెండెంట్
1962	అంధవరపు తవిటయ్య	కాంగ్రెస్
1967	తంగి సత్యనారాయణ	స్వతంత్ర పార్టీ
1972	చల్లా లక్ష్మీనారాయణ	స్వతంత్ర
1978	చల్లా లక్ష్మీనారాయణ	జనతా పార్టీ
1983	తంగి సత్యనారాయణ	టీడీపీ
1985	గుండ అప్పలసూర్యనారాయణ	టీడీపీ
1989	గుండ అప్పలసూర్యనారాయణ	టీడీపీ
1994	గుండ అప్పలసూర్యనారాయణ	టీడీపీ
1999	గుండ అప్పలసూర్యనారాయణ	టీడీపీ
2004	ధర్మాన ప్రసాదరావు	కాంగ్రెస్
2009	ధర్మాన ప్రసాదరావు	కాంగ్రెస్
2014	గుండ లక్ష్మీదేవి	టీడీపీ
2019	ధర్మాన ప్రసాదరావు	వైసీపీ

అవునా!

ఎన్నికల ఏజెంట్ చాలెంజ్ ఓటు వినియోగించుకోచ్చు

పలాస: నకిలీ ఓటర్లను అడ్డుకోవడానికి చాలెంజ్ ఓటు ఉపయోగపడుతుంది. ఓటింగ్ జరుగు తున్న సమయంలో పోలింగ్ కేంద్రంలో చాలెంజ్ ఓటుకు అవకాశం ఉంటుంది. ఓటింగ్ జరుగుతున్న సమయంలో ప్రిసైడింగ్ అధికారులతోపాటు ఎన్నికల ఏజెంట్ కూడా పోలింగ్ కేంద్రంలో కూర్చొంటారు. ఏజెంట్లు ఓటర్లను గుర్తించే పనిలో ఉంటారు. పార్టీలు, లేదా అభ్యర్థులు తమ తరఫున వారిని పోలింగ్ కేంద్రాల్లో నియమిస్తారు. ఎన్నికల ఏజెంట్ ఈ చాలెంజ్ ఓటును ఉపయోగించుకుంటారు. ఈ చాలెంజ్ ఓటుకోసం కొంత రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఎవరైనా ఓటరు ఓటువేయడానికి పోలింగ్ కేంద్రానికి వచ్చినప్పుడు అతను నకిలీ ఓటరు అని ఏజెంట్ అను మానించినప్పుడు చాలెంజ్ ఓటు ఉపయోగపడుతుంది. అటువంటి పరిస్థితుల్లో పోలింగ్ ఏజెంట్ ప్రిసైడింగ్ అధికారి ముందు చాలెంజ్ ఓటువేస్తాడు. అప్పుడు ఎలక్టోరల్ అధికారి ప్రిసైడింగ్ అధికారికి ఆయన్ను సరైన ఓటరు కాదని చెబుతాడు. దీంతో ఆయన ఓటరు దగ్గరున్న పత్రాలు తనిఖీ చేసి అవి సక్రమంగా ఉంటే ఓటరుకు ఓటు హక్కు కల్పిస్తారు. ఎన్నికల ఏజెంట్ చెప్పినది సక్రమమైతే ఓటు వేయకుండా అడ్డుకుంటారు.



ఎస్ఎంపురం తప్పెటగుళ్ల కళాకారులు

ఎన్నికల ప్రచారంలో తప్పెటగుళ్లు ఉండాల్సిందే..

సందడి

రణస్థలం: ప్రస్తుత ఎన్నికల ప్రచారంలో తప్పెటగుళ్ల సందడి కనిపిస్తోంది. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా తప్పెటగుళ్లతో కళాకారులు ఆడిపాడుతున్నారు. ఎన్నికల ప్రక్రియలో ముందుగా నిర్వహించే నామినేషన్ల పర్వంలోనే ఎక్కువ సందడి ఉంటుంది. ఈ కార్యక్రమానికి ఎంత బాగా జనసమీకరణ చేస్తే, అంతకంటే జోరుగా ప్రచారం సాగుతుందని రాజకీయ పార్టీల విశ్వాసం. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏ ముఖ్య నేత వచ్చినా స్వాగతం పలికేందుకు తప్పెటగుళ్ల కళాకారులు ముందుంటారు. జిల్లాలో ఎస్ఎంపురం, పెద్దపాడు, ముద్దాడ, అల్లినగరం, బుడుమూరు, బావాజీపేట, జొన్నలపాడు తదితర గ్రామాల్లో సుమారు 1200 మంది తప్పెటగుళ్ల కళాకారులు ఉన్నారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్ఎంపురం కళాకారులు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొని సందడి చేశారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే జైలే...

హెచ్చరిక



హిరమండలం: కొందరు అభ్యర్థులు సెంటిమెంట్‌ను రెచ్చగొడితేనే ఓట్లు పడతాయని భావించి కులం, వర్గం, ప్రాంతం పేరుతో ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారు. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలను అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికల సంఘం నియమావళిలో కఠిన నిబంధనలు రూపొందించింది. ఎన్నికల్లో ఎవరైనా జాతి, మత, కుల, భాష, సమాజం పేరుతో రెచ్చగొడితే ఆర్‌పీ చట్టం-1951 సెక్షన్ 125, ఐసీసీ సెక్షన్ 153ఏ ప్రకారం మూడేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తారు. ఓటు కోసం మద్యం, డబ్బులు, ఇతర వస్తువులను తీసుకున్న వారిని కూడా నేరస్థులగానే పరిగణిస్తారు. ఐపీసీ సెక్షన్ 171బి, 171 ఈ, హెచ్ ప్రకారం లంచంగా పరిగణించి ఏడాది జైలు శిక్ష విధిస్తారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రవాహంపై నిఘా పెంచారు. నజరానాలకు లొంగినా, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

మబగాం నుంచి మంత్రులు

గుర్తింపు

పోలాకి: మూడు దశాబ్దాలుగా మబగాం గ్రామం రాష్ట్ర రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తోంది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఇక్కడి నుంచే ప్రజాప్రతినిధులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ గ్రామస్థులకు మంత్రి వర్గంలో కీలక పదవులతోపాటు డిప్యూటీ సీఎం స్థాయి పదవులు సైతం వరించాయి. ఈ గ్రామానికి చెందిన ధర్మాన ప్రసాదరావు కాంగ్రెస్ తరఫున గెలుపొంది మూడుశాఖలకు మంత్రిగా సుదీర్ఘకాలం పాటు పలువురు ముఖ్యమంత్రుల కాలంలో వ్యవహరించారు. 1989 నుంచి 99 వరకూ మూడు సార్లు ధర్మాన ప్రసాదరవు బగ్గు లక్ష్మణరావుపై గెలుపొందారు. 1999లో లక్షణరావుపై ఓటమిచెందారు. ఈ నేపథ్యంలో 2004లో శ్రీకాకుళం నుంచి ప్రసాదరావు పోటీచేశారు. ఆ ఎన్నికల్లో అదే గ్రామానికి చెందిన ప్రసాదరావు సోదరుడు కృష్ణదాసు పోటీచేసి గెలుపొందారు. 2014లో అదే గ్రామానికి చెందిన బగ్గు రమణమూర్తిపై ఓటమిపాలయ్యారు. 2019లో జరిగిన ఎన్నికల్లో కృష్ణదాసు గెలుపొంది జగన్ క్యాబినెట్‌లో ఉప ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో ఒకే గ్రామానికి చెందిన కృష్ణదాసు, రమణమూర్తి పోటీపడుతున్నారు.



మబగాం గ్రామం

అరచేతిలో ఎన్నికల సమాచారం

- ప్రత్యేక యాప్‌లు అందుబాటులోకి తెచ్చిన ఈసీ

(నరసన్నపేట)

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎన్నికల సంఘం ఓటర్లకు పూర్తిస్థాయి సమాచారం, సాంకేతిక సహకారం అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టింది. ఫిర్యాదులు చేసేందుకు, ఓటర్లకు ప్రలోభాలు, అక్రమాలను అరికట్టేందుకు ప్రత్యేక యాప్‌లు, పోర్టల్, వెబ్‌సైట్లు అందుబాటులోకి తీసుకువచ్చింది. కేంద్ర ఎన్నికల సంఘం రూపొందించిన యాప్‌లను వినియోగించుకొనేందుకు వీలుగా అందుబాటులోకి తీసుకువచ్చారు. తప్పు చేసిన వారికి క్షణాల్లో శిక్ష అమలయ్యేలా యాప్‌లను ఈసీ రూపొందించింది.



ఓటరు సాయానికి 'వీహెచ్‌ఎస్'

ఓటర్ల సమాచారాన్ని తెలుసుకొనేందుకు వీలుగా ఓటరు హెల్ప్‌లైన్ యాప్ (వీహెచ్‌ఏ) పేరిట ప్రత్యేక వ్యవస్థను ఎన్నికల సంఘం రూపొందించింది. ఇందులో ఓటు నమోదు చేసు కునేందుకు వీలుగా దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి. జాబితాలో పేర్లు ఉన్నాయా? లేదా? అన్నది సులువుగా తెలుసుకోవచ్చు. ఎపిక్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఫిర్యాదులకు ప్రత్యేకం 'ఎన్జీఎస్'



ఓటర్లు ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు చేసేందుకు నేషనల్ గ్రీవెన్స్ సర్వీసెస్ (ఎన్జీఎస్) పేరిట ఒక పోర్టల్ ఉంది. ఓటర్ల జాబితాకు సంబంధించిన ఫిర్యాదులను ఇందులో నమోదు చేయవచ్చు. దేశవ్యాప్తంగా ఏ నియోజకవర్గానికి చెందిన ఫిర్యాదులైనా ఇందులో నమోదు చేయవచ్చు. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ వివరాలను పొందుపరిస్తే సంబంధిత నియోజకవర్గ అధికారులు వీటిని పరిశీలించి చర్యలు చేపడతారు.

అభ్యర్థి గురించి తెలుసుకోండిలా..

మీ అభ్యర్థి గురించి తెలుసుకునేందుకు నో యువర్ క్యాండిడేట్ (కేవైసీ) పేరిట ఒక వెబ్‌సైట్ ఉంది. అభ్యర్థులు నామినేషన్ల సందర్భంగా దాఖలు చేసే ప్రమాణపత్రాలు (అఫిడవిట్లు) ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు ఎన్నికల సంఘం ఈ వెబ్‌సైట్‌ను రూపొందించింది. పోటీలో ఉన్న అభ్యర్థి ఎటువంటి వారు, వారికి నేర చరిత్ర ఏమైనా ఉందా, వారికి ఏఏ ఆస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయి, స్థిర, చరాస్తుల వివరాలు, బంగారు ఆభరణాల వివరాలను తెలుసుకోవచ్చు.



'సి-విజిల్'తో అక్రమాలకు చెక్

ఎన్నికల్లో ప్రలోభాలు, అక్రమాలను అరికట్టేందుకు ఉద్దేశించిన యాప్ ఇది. ప్రజలు తాము గుర్తించిన అక్రమాలను సి-విజిల్ యాప్‌లో సంక్షిప్తంగా నమోదుచేయాలి. వంద నిమిషాల వ్యవధిలో అధికారులు ఆ ప్రదేశానికి చేరుకుని సమాచారం ఆధారంగా చర్యలు తీసుకుంటారు. తీసుకున్న చర్యల గురించి ఫిర్యాదు చేసిన వ్యక్తి ఫోన్‌కు మెసేజ్ రూపంలో తెలుపుతారు. సమా చారం ఇచ్చిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచడం ఈయాప్ ప్రత్యేకత.



మీకు తెలుసా?



దివ్యాంగుల చేయూతకు 'సాక్ష్యం'...

వయోవృద్ధులు, దివ్యాంగుల సౌలభ్యం కోసం సాక్ష్యం యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. పోలింగ్ కేంద్రానికి సొంతంగా రాలేని వారు ఇందులో తమ పేర్లు నమోదు చేసుకోవచ్చు. నమోదు చేసుకున్న వారిని పోలింగ్ కేంద్రానికి తీసుకు వచ్చేందుకు అధికారులు రవాణా సదుపాయాన్ని కల్పిస్తారు. దివ్యాంగుల కోసం చక్రాల కుర్చీని సమకూర్చుతారు.

జన కేతనం
ఆంధ్రజ్యోతి గురువారం 25 ఏప్రిల్ 2024


నిలిచిపోయిన మద్దువలస కాలువ నిర్మాణం

స్పీకర్ సార్..

- ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల సంగతేంటి? ● మద్దువలస రెండోదశ పనులు ఏమయ్యాయి? ● డిగ్రీ కళాశాల భవనాల మాటేంటి?
- చేనేత కార్మికులను మరిచిపోయారా? ● ట్రాఫిక్ సమస్యను వదిలేశారు
- పార్క్ ఆధునికీకరణ ఊసే లేదు ● సీతారాంను ప్రశ్నిస్తున్న పొందూరు వాసులు

ఐదేళ్లు సరిపోలేదా?

పొందూరులో సమస్యలన్నీ పరిష్కరిస్తామని గత ఎన్నికల ముందు స్పీకర్ తమ్మినేని సీతారాం హామీ ఇచ్చారు. అయితే, అధికారం చేపట్టి ఐదేళ్లు పూర్తయినా ఆ హామీలను నెరవేర్చలేదు. ఇచ్చిన హామీలను మరచిపోయారు. ప్రధానంగా మద్దువలస రెండోదశ పనులు, డిగ్రీ కళాశాల భవనాలు, చేనేత కార్మికులకు ప్రోత్సాహం, పొందూరు పార్కు ఆధునికీకరణ, తదితర సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి గాలికొదిలేశారు. ఈ ఐదేళ్లు ఏమిచేశారని పలువురు పొందూరు ప్రజలు స్పీకర్‌ను ప్రశ్నిస్తున్నారు. (పొందూరు)

శంకుస్థాపనతో సరి

మండలంలో 12,500 ఎకరాలకు నీరందించే మద్దువలస రెండోదశ కాలువ పనులు ముందుకుసాగలేదు. 12 ఏళ్లుగా మద్దువలస రెండోదశ పనులు సాంకేతిక కారణాలతో నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తి చేస్తామని గత ఎన్నికల ప్రచారంలో తమ్మినేని సీతారాం హామీఇచ్చారు. నాలుగేళ్ల తరువాత గతఏడాది ఏప్రిల్ 24న రూ.26 కోట్లతో పనులకు శంకుస్థాపన చేశారు. త్వరగా పూర్తిచేసి ఖరీఫ్‌లో రైతులకు నీరందిస్తామని నీటిపారు దల శాఖమంత్రి అంబటి రాంబాబు, మంత్రి బొత్స సత్యనారాయణ, స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రకటించారు. అయితే, భూసేకరణ విషయంలో రైతుల సమస్యలు పరిష్కరించకపోవడం, నిధులు పూర్తిస్థాయిలో విడుదల కాకపోవడంతో ఎక్కడిపనులు అక్కడే నిలిచిపోయాయి.

చిత్తశుద్ధి లేదు



వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మద్దువలస కాలువ నిర్మాణం పూర్తిచేసి నీరందిస్తామని స్పీకర్ హామీ ఇచ్చారు. నాలుగేళ్ల కనీసం పట్టించుకోకుండా ఏడాది కిందట పనులకు శంకుస్థాపన చేశారు. భూసేకరణ కోసం రైతులతో మాట్లాడకపోవడంతో సమస్య మొదటికి వచ్చింది. హామీ అమలులో చిత్తశుద్ధి లేదు

\- పైడి రామారావు, వావిలపల్లిపేట


ఇరుగ్గా ఉన్న మార్కెట్-కాంప్లెక్స్ రోడ్డు

ట్రాఫిక్ సమస్యతో అగచాట్లు

పొందూరు పట్టణంలో జనాభా రోజురోజుకూ పెరుగుతుతోంది. జిల్లా వ్యాపార కూడలిగా మారుతోంది. వేలాదిమంది భూముల రిజిస్ట్రేషన్లకు ఇక్కడి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వస్తుంటారు. దీనికి అనుగుణంగా రోడ్లను విస్తరించడంలేదు. దీంతో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ప్రధానంగా మార్కెట్ నుంచి కాంప్లెక్స్ వెళ్లే ప్రధాన రోడ్డు ఇరుగ్గా ఉండడంతో ప్రతిరోజు ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. దీంతో విద్యార్థులు, ఉద్యో గులు అగచాట్లకు గురవుతున్నారు. గత ఎన్నికల్లో రోడ్లు వెడల్పుచేస్తామని తమ్మినేని సీతారాం ఇచ్చిన హామీ నేటికీనెరవేర్చలేదని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు.

హామీ నెరవేరలేదు



నిత్యం రద్దీగా ఉండే మార్కెట్- కాంప్లెక్స్ రోడ్డు కనీసం 10 అడుగులు లేక పోవడంతో ట్రాఫిక్ స్తంభించిపోతుంది. ఆక్రమణలు తొలగించి వెడల్పు చేసి రోడ్డు నిర్మిస్తామని గత ఎన్నికల్లో స్పీకర్ ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదు.

\-పశుపురెడ్డి శ్రీనివాసరావు, పొందూరు


అభివృద్ధికి నోచుకోని పొందూరు పార్కు

దిష్టిబొమ్మలా పార్క్

పొందూరు మధ్యలో ఉన్న నెహ్రూ పార్క్ నిర్వహణలేక దిష్టిబొమ్మగా మారింది. పార్క్‌ను సుందరంగా తీర్చిదిద్దుతామని గత ఎన్నికల్లో స్పీకర్ తమ్మినేని సీతారాం ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదు. పర్యవేక్షణ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. ఈ ఐదేళ్లలో నెహ్రూపార్కు అభివృద్ధికి కనీసం రూపా యి నిధులు కూడా విడుదల చేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎన్నిసార్లు పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యమని ఆవేదన చెందుతున్నారు.

ఆహ్లాదకరం కరువైంది



పొందూరులో వృద్ధులు, చిన్నారులు సేదదీరేందుకు కనీసం ఆహ్లాదకరమైన ఒక్క పార్క్ కూడా లేదు. ఎన్ని నిధులు అవసరమైనా విడుదల చేసి పార్కును సుందరంగా తీర్చిదిద్దుతామని గత ఎన్నికల్లో స్పీకర్ ఇచ్చిన హామీ అటకెక్కిపోయింది. పార్క్‌లో అభివృద్ధి చేసిందేమీ లేదు గాని సీటీట్యాంకు నిర్మించి పార్క్‌ను కుదిస్తున్నారు.

\-కె. భాస్కరరావు, పొందూరు

క్లస్టర్లతో ఒరిగేదేమీ లేదు


పొందూరులో నేతనేస్తున్న కార్మికులు

పొందూరు పేరు చెప్పగానే ఖాదీ, చేనేత గుర్తొస్తాయి. గత ఎన్నికల ముందు పాదయాత్రకు ఈ ప్రాంతానికి వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఖాదీ, చేనేతను ప్రోత్సహిస్తామని ప్రకటించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత, ఖాదీకి ప్రోత్సాహం లేదు కదా నూలు సబ్సిడీ తీసివేయడంతో నేతన్నలు నష్టపోతున్నారు. చేనేత అభివృద్ధి కోసం పొందూరులో రెండు, తోలాపిలో ఒక చేనేత క్లస్టర్ ఏర్పాటు చేసినా ఎటువంటి ప్రయోజనం లేకుండాపోయింది. ఇప్పటివరకు నేత, వడుకు కార్మికులకు రూపాయి ప్రయోజనం చేకూరలేదు.

ఒక్కరూపాయి ప్రయోజనం లేదు



చేనేత క్లస్టర్ ఏర్పాటు చేసి ఏడాది దాటుతున్నా ఇంతవరకు చేనేత కార్మికులకు రూపాయి ప్రయోజనం లేదు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత నూత సబ్సిడీ తీసివేశారు. దీంతో ఒక్కో చేనేత కార్మిక కుటుంబం ఏడాదికి రూ.50 వేలు వరకు నష్టపోతోంది

\- కె.శ్రీనివాసరావు, మాజీ ఉపాధ్యక్షుడు, సాయిబాబా చేనేత సొసైటీ, పొందూరు

భవనాలు లేక..విద్యార్థుల బేజారు



జూనియర్ కళాశాలలోనే డిగ్రీకి ఓ బ్లాక్ కేటాయించిన దృశ్యం

పొందూరు వాసుల దశాబ్దాల కలను గత టీడీపీ ప్రభుత్వం నెరవేర్చింది. అప్పటి విప్ కూన రవికు మార్ పట్టుబట్టి పొందూరుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మం జూరు చేయించారు. కళాశాల భవ నాల నిర్మాణానికి రాపాక సమీపంలో 310 సర్వేనంబరులో కొండకు ఆనుకుని సుమారు ఐదెకరాలు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఇంతలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో డిగ్రీ కళాశాల ప్రక్రియ నెమ్మదిగా సాగింది. కొత్త భవనాలను నిర్మిస్తామని చెప్పిన స్పీకర్ దాన్ని గాలికొదిలేశారు. దీంతో తాత్కాలికంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాల్లో డిగ్రీ తరగతులను నిర్వహిస్తు న్నారు. ఈ ఐదేళ్లలో డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు. దీంతో అరకొర ఉన్న భవనాల్లో తరగతులు నిర్వహిస్తుండడంతో విద్యార్థులు ఇబ్బందిప డుతున్నారు.

గదులు లేక ఇబ్బంది

డిగ్రీ కళాశాలలో తరగతి గదులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో తీవ్రంగా ఇబ్బందిపడుతున్నాం. కళాశాలలో మరుగుదొడ్ల సౌకర్యం పూర్తిస్థాయిలో లేదు. ప్రధానంగా విద్యార్థినులు నరకం చూస్తున్నారు. శాశ్వత కళాశాల భవనాలు నిర్మిస్తే తప్ప ఇబ్బందులు తప్పవు.

\-శ్రీనివాసరావు, విద్యార్థి

రోడ్డే వేయనోళ్లు ఇంకేం చేస్తారు?

- ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎంతో నష్టపోయాం
- రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు రావాలి
- శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్‌నాయుడు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)



శ్రీకాకుళం- ఆమదాలవలస రోడ్డును ఇటు మంత్రి ధర్మాన ప్రసాదరావు, అటు స్పీకర్ తమ్మినేని సీతారాం వేయలేక పోయారని, ఐదేళ్లలో 15 కిలోమీటర్ల రోడ్డును పూర్తిచేయలేని వారు ప్రజలకు ఇంకేం చేస్తారని శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ప్రశ్నించారు. బుధవారం శ్రీకాకుళంలోని ఎన్టీఆర్ మునిసిపల్ హైస్కూల్ మైదానంలో జిల్లా మహిళలతో టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబునాయుడు ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి రామ్మోహన్ పాల్గొని మాట్లాడారు. మరో నలభైరోజుల్లో ఆంధ్రాకు కాబోతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని తెలిపారు. ఐదేళ్ల కాలంలో అత్యధికంగా నష్టపోయింది మహిళలేనని చెప్పారు. పేదలకోసం 40 ఏళ్లుగా టీడీపీ పనిచేస్తోందని తెలిపారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కును కల్పించింది ఎన్టీఆర్ అని, డ్వాక్రా సంఘాలు పెట్టించి మహిళా సంఘాలకు ఎంతగానో ఆర్థికసహాయం అందించిన ఘనత చంద్రబాబుదేనని తెలిపారు. సంక్రాంతికి ప్రతి ఇంటికీ కానుకలు పంపించేవారని, పసుపు-కుంకుమతో మహిళలందరికీ సహాయం అందించేవారని చెప్పారు. జగన్‌లా మోసం చేయలేదని తెలిపారు. చంద్రబాబు శ్రీకాకుళంలో మూడు వేలు టిడ్కో ఇళ్లు కట్టించారని, వైసీపీ వచ్చిన తర్వాత లబ్ధిదారులకు ఇళ్లు, చెల్లించిన డబ్బులు ఇవ్వలేదని ఆరోపించారు. మహిళలకు మంచి జరగాలన్నా, రాష్ట్ర బాగుపడాలన్నా చంద్రబాబు మళ్లీ సీఎం కావాలన్నారు. త్రిమూర్తులుగా చంద్రబాబు, పవన్ కల్యాణ్, నరేంద్రమోదీ ప్రజలను అన్నివిధాలా ఆదుకుంటారని తెలిపారు. మే 13న జరిగే ఎన్నికలకు ధైర్యంగా ప్రజలు ముందుకువచ్చి ఓట్లు వేయాలని కోరారు.


మహిళలకు అభివాదం చేస్తున్న టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మహిళలు

జగన్ మాటలేమయ్యాయి: రవికుమార్



'టీడీపీ హయాంలో ఉపాధిహామీ పనులకు వెళ్లినవారికి తాగునీటి కోసం రూ.10 చొప్పున ఇచ్చేవారు. ఇప్పుడు జగన్‌రెడ్డి అవన్నీ తీసేసి.. బటన్‌నొక్కి మనవద్ద నుంచి డబ్బులు తీసుకుంటున్నాడు'అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ ఆరోపించారు. జగన్మోహన్‌రెడ్డివి అన్నీ అసత్యాలేనని తెలిపారు. అమ్మఒడి రూ.15వేలు అని చెప్పి ఓ ఏడాది రూ. 14వేలు.. మిగిలిన మూడేళ్లు రూ.13వేలు చొప్పున ఇచ్చాడన్నారు. జగన్ ఆఖరి ఏడాది ఎగ్గొట్టాడని తెలిపారు. మద్యం లేకుండా చేసి ఓటు అడుగుతామని చెప్పిన జగన్.. ఇప్పుడు ఆ మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మహిళలూ మీరే చెప్పండి ప్రతిగ్రామంలో మద్యం దొరుకుతుందా లేదా అని అడిగారు. నిత్యావసరాల ధరలు పెంచేశారని, చెత్త, నీటిపన్నులు, కరెంట్ చార్జీలు పెంచేశాడ న్నారు. సంక్షేమం అన్ని కుటుంబాలకు అందాలన్నదే టీడీపీ ధ్యేయమని తెలిపారు. ● కూన రవి కుమార్‌ను చంద్రబాబు దుశ్శాలువతో సత్కరించారు. టీడీపీ జిల్లా అధ్యక్ష పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నానని.. తన పదవిని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణకు ఇవ్వాలని ఆయన కోరారు. దీంతో అందరూ అంగీకరించారు. అనంతరం రవికుమార్‌ను చంద్రబాబు సత్కరించారు.

చంద్రబాబు స్ఫూర్తితో అన్న క్యాంటీన్ నిర్వహించా: గొండు శంకర్



చంద్రబాబునాయుడి స్ఫూర్తితో శ్రీకాకుళం నగరంలో అన్నక్యాంటీన్‌ను ఏడాది పాటు నిర్వహించి 1.50లక్షల మందికి భోజనం పెట్టానని శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గొండు శంకర్ తెలిపారు. వైసీపీ నాయకు లు మాయమాటలు చెబుతున్నారని ఆరోపించారు. అర్హులకు పెన్షన్లు ఇవ్వడంలేదన్నారు. నియోజకవర్గ ప్రజలకోసం పారిశ్రామిక హబ్ కావాలని, మత్స్యకారుల కోసం జెట్టీ నిర్మించాలని కోరారు. టీడీపీ హయాంలో చేపట్టిన టిడ్కో ఇళ్లను వైసీపీ పూర్తిచేయలేదని ఆరోపించారు. శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్‌నాయుడిని గెలిపించాలని కోరారు. అందరం కలిసి చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రి చేయాలని పిలుపునిచ్చారు.

కదిలివచ్చిన పసుపుదండు

- ఇచ్ఛాపురం టీడీపీ అభ్యర్థి అశోక్ నామినేషన్
- ఎంపీ రామ్మోహన్‌తో కలిసి పట్టణంలో భారీ ర్యాలీ


ర్యాలీ చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బెందాళం అశోక్ చేపట్టిన నామినేషన్ ర్యాలీకి పసుపు దండు కదలివచ్చింది. ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్‌నాయుడితో కలసి బుధవారం రామయ్యపుట్టుగ నుంచి చేపట్టిన ర్యాలీ ఇచ్ఛాపురం వరకు సాగింది. ఈ ర్యాలీకి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. దారిపొడవునా ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు ప్రజలు నీరాజనం పలికారు.జై తెలుగుదేశం.. జై అశోక్ అన్న, జై లోకేష్‌బాబు అంటూ శ్రేణులు నినాదాలు చేశాయి. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ దాసరి రాజు, వార్డు కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పట్టణ,మండల అధ్యక్షులు, జనసేన, బీజేపీ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


మహిళా కార్యకర్తల ఉత్సాహం

రేపు నామినేషన్ల పరిశీలన: కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ మంజీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్: నామినేషన్ల పరిశీలన ఈనెల 26న (శుక్రవారం) ఉంటుందని, అలాగే 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరించుకోవచ్చని జిల్లా ఎన్నికల అధికారి మన్‌జీర్ జిలానీ సమూన్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఆర్వోలు, నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నామినేషన్ల ఉప సంహరణ తరువాత గుర్తులు (సింబల్స్) కేటాయిస్తామని, ఈ ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు జరుగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. మే 7 నుంచి 9 వరకు హోం ఓటింగ్‌కు చర్యలు తీసుకోనున్నామ న్నారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ జరుగుతుంద న్నారు. బుధవారం రాత్రికి కొత్తగా ఓటు నమోదు, బదిలీకి సంబంధించిన దరఖాస్తులను పరిష్కరించనున్నట్లు తెలిపారు. వచ్చే నెల 4న జరుగనున్న ఎన్నికల కమిషన్ వీడియో కాన్ఫరెన్స్‌కు అధికారులు సంబంధిత నివేదికలతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఈనెల 27, 28 తేదీల్లో ఎన్నికల విధులు నిర్వర్తి స్తున్న సిబ్బందికి ఉత్తర్వులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ ఎం.నవీన్, డీఆర్వో ఎం.గణ పతిరావు, సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఆర్వోలు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూంను...

సాధారణ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, కంట్రోల్ రూమ్‌లను జిల్లా ఎన్నికల అధికారి మన్‌జీర్ జిలానీ సమూన్ బుధవారం పరిశీలించారు. అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా వ్యవహరించాలని ఆదేశించారు. కాల్ సెంటర్, సీ-విజిల్‌కు వస్తున్న ఫిర్యాదులు, వాటిపై తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీపీవో ప్రసన్నలక్ష్మి, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, హౌసింగ్ పీడీ గణపతిరావు పాల్గొన్నారు.

శ్రీచక్రాలయంలో చోరీ

● బంగారు, వెండి ఆభరణాలతో పాటు రూ.40 లక్షలు అపహరణ


గర్భాలయంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ బృందం

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 24: ఎచ్చెర్ల మండలం కుంచాల కురమయ్యపేట శ్రీచక్రాలయంలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. 30 తులాల వరకు బంగారం, సుమారు వంద తులా ల వెండితోపాటు రూ.40 లక్షల నగదు చోరీ జరిగినట్లు పీఠాధిపతి తేజోమూర్తుల బాల భాస్కరశర్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సాధారణ రోజుల్లో ఆభరణాలన్నింటినీ ఏ రోజుకారోజు తీసి భద్రపరిచేవారు. అయితే మంగళవారం పౌర్ణమి కావడంతో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల తాకిడి ఎక్కువగా ఉండడంతో అమ్మవారికి అలంకరించిన ఆభరణాలను తీయలేదు. వివిధ పూజా కార్యక్రమాలకు సేకరించిన సుమారు రూ.40 లక్షల నగదు గర్భగుడిలో ఉంచి రాత్రి ఒంటి గంట సమయంలో తాళం వేశారు. బుధవారం వేకువజామున నాలుగు గంటలకు నిత్య పూజలకు గాను ఆలయం తెరిచి చూసేటప్పటికీ అమ్మవారి ఆభరణాలు, నగదు కనిపించ కపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. ఇదిలా ఉండగా ఆలయంలో ఉన్న హుండీలను కూడా దుండగులు ఎత్తుకు పోయి వాటిలో ఉన్న నగదు, కానుకలు దోచి హుండీలను సమీప పొలాల్లో వదిలేశారు. ఆలయ ప్రాంగణంతో పాటు గర్భగుడిలోని సీసీ కెమెరాలతో పాటు డీవీఆర్ (రికార్డు అయిన చిప్‌బాక్స్)ను ఎత్తుకు పోయారు. ఈ దోపిడీలో ఐదుగురు పాల్గొన్నట్లు పోలీసులు ప్రాథమి కంగా గుర్తించారు. కొద్ది రోజుల నుంచి నిర్వహిస్తున్న వసంత నవరాత్రి ఉత్సవాలు, కోటి శివలింగాల ఏర్పాటుకు సంబంధించి వివరాళాలు సేకరించిన మొత్తం నగదు కూడా ఆలయ గర్భగుడిలో ఉంచినట్లు సమాచారం. ఇదిలా ఉండగా సీఎం, ప్రతిపక్ష నేతలిద్దరూ జిల్లాలోనే ఉండడంతో పోలీసులంతా వారి బందోబస్తులో ఉండగా ఇదే అదునుగా దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇంత భారీగా ఈ ప్రాంతంలో గతంలో ఎన్నడూ జరగకపోవడంతో ప్రజలు ఆందో ళన చెందుతున్నారు. పీఠాధిపతి ఫిర్యాదు మేరకు బుధవారం ఉదయం ఆరు గంటలకు పోలీ సులు, క్లూస్‌టీమ్ ఘటనా స్థలాన్ని సందర్శించి ఆధారాలను సేకరించారు. ఎచ్చెర్ల పోలీసులు వివరాల నమోదు చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాటమ్మ ఆలయంలోనూ..

పలాసరూరల్: తర్లాకోట సమీపంలోని కాటమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి దొంగలు చొరబడి తాళాలను పగలగొట్టి హుండీని దోచుకున్నారు. గతంలో కూడా ఇలాంటి ఘటన జరిగిన నేపథ్యంలో ఆలయం చుట్టుపక్కల గ్రిల్స్‌ను ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఆ గ్రిల్స్‌ను కోసి ఆలయం లోపలకు వెళ్లేందుకు దొంగలు ప్రయత్నించినా కుదరక పోవడంతో హుండీని దోచు కున్నారు. ఎప్పటిలాగే బుధవారం ఉదయం పూజారి ఆలయం తలుపులు తెరిచి చోరీ జరిగినట్లు గుర్తించి ఆలయ కమిటీ సభ్యులకు తెలిపారు. ఈ నేపథ్యంలో వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్రతి మంగళ, ఆదివారాల్లో ఎక్కువ సంఖ్యలో భక్తులు వస్తుండడం, కానుకలు సమర్పిస్తుండడంతో చోరీకి పాల్పడి ఉంటారని పలువురు గ్రామస్థులు పేర్కొంటున్నారు.

సీఎం పర్యటనలో వైసీపీ నేత రచ్చ

● భద్రతా సిబ్బంది, పోలీసులతో వాగ్వాదం

శ్రీకాకుళం అర్బన్: సీఎం జగన్మోహన్ రెడ్డి జిల్లా పర్యటనలో బుధవారం స్థానిక కొత్తరోడ్ సమీపంలోని గోపీనగర్ వద్ద హైవేపై నగర పరిధిలోని బొందిలీపురానికి చెందిన వైసీపీ నేత ఎండ రమేష్ రచ్చ చేశాడు. సీఎం భద్రతా దళాలతో వాగ్వాదానికి దిగాడు. వివరాలిలా ఉన్నాయి.. సీఎం జగన్ టెక్కలిలో నిర్వహించనున్న సిద్ధం ముగింపు సభకు అక్కివలస క్యాంప్ నుంచి బస్సులో హైవే మీదుగా కొత్తరోడ్ సమీపంలోని గోపీనగర్ వద్దకు చేరుకున్నారు. ఇక్కడ సీఎంను కలిసేందుకు స్పీకర్ తనయుడు తమ్మినేని చిరంజీవి నాగ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు వచ్చారు. పోలీసులు, బందోబస్తు బృందం రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసి రోప్‌లను దాటి బస్సుకు అడ్డంగా నిలబడి ఆయనకు అభివాదం చేసేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో ఉదయం 11.30 గంటల సమయంలో సదరు వైసీపీ నేత ఎండ రమేష్, శ్రీకాకుళానికి చెందిన డివిజన్ ఇన్‌చార్జులు తామేం తక్కువ కాదంటూ పోలీసులను, సీఎం భద్రతా దళాన్ని దాటుకుని జగన్‌ను కలిసే ప్రయత్నం చేశారు. దీంతో ఒక్కసారి గందరగోళం నెలకొంది. పోలీసులంతా అప్రమత్తమై బస్సును అడ్డంగా ఉన్న ప్రజలను చెదరగొట్టే ప్రయత్నం చేశారు.

ఇదే సమయంలో తాను వైసీపీ నేతనని, సీఎంను కలవకుండా ఎలా అడ్డుకుంటారని ఎండ రమేష్ బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు, సీఎం భద్రతాదళంతో వాగ్వాదానికి దిగాడు. సీఎం నుంచి ఆదేశా లొస్తే కానీ ఎవరినీ పంపలేమని చెప్పినా వినిపించుకోకుండా గొడవకు దిగాడు. వివాదం పెద్దది అవుతుండడంతో శ్రీకాకుళం సీఐ ఎల్.సన్యాశినాయుడు కలుగజేసుకుని వెంటనే పరిస్థితిని సద్దుమణిగేలా చేశారు.

బస్సులన్నీ సీఎం సభకే..

● ఇబ్బందులు పడిన ప్రజలు


కొత్తూరు కాంప్లెక్స్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

కొత్తూరు/నందిగాం/నరసన్నపేట: టెక్కలిలో బుధవారం జరిగిన సీఎం జగన్ సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులను తరలించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొత్తూరు బస్టాండ్‌లో బుధవారం బస్సులు లేక ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ రోజు బస్సులు నడవవని చిన్న కరపత్రాన్ని కంట్రోల్ రూమ్ గోడలకు అతికించారు. వైద్య పరీక్షలు నిమిత్తం కిడ్నీ రోగులు, డయాలసిస్ కోసం నిత్యం శ్రీకాకుళం వెళ్లేవారు ఇబ్బందులు పడ్డారు. అలాగే నందిగాం, పెద్ద తామరాపల్లి, నర్సిపురం జంక్షన్, తురకలకోట ప్రాంతాల్లో ప్రయాణికులు నిరీక్షించి అష్టకష్టాలుపడ్డారు. అలాగే నరసన్నపేట హైవేపై కూడా బస్సులు లేకపోవడంతో వృద్ధులు, దివ్యాంగులు, ప్రజలు ఆటోలను ఆశ్రయించాల్సి వచ్చింది.

గాలీ వాన బీభత్సం


వంశధార కార్యాలయం వద్ద పడిన చెట్టు

హిరమండలం: హిరమండలంలో బుధవారం సాయం త్రం ఈదురు గాలులతో పాటు భారీ వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా ఎండల తీవ్రతతో అల్లాడిన ప్రజలకు భారీ వర్షంతో కొంత ఊరట కలిగింది. వాతావరణ చల్లబడింది. ఈదురుగాలులకు పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి. మామిడి పంట రాలిపోయింది. విద్యుత్ తీగెలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.


పాతపట్నంలో కురిసిన వర్షం

పాతపట్నంలో...

పాతపట్నం: పాతపట్నంలో బుధవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈదురుగాలులు వీచాయి. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. ఇటీవల కాలంలో ఠారెత్తిస్తున్న ఎండల నుంచి ఈ వర్షం కొంతమేర ఉపశమనం కలిగించింది.

నందిగాంలో...

నందిగాం: మండలంలో బుధవారం సాయంత్రం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. మధ్యాహ్నం 3గంటల వరకు ఎండతీవ్రతతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు ఒక్కసారి వాతావరణంలో మార్పుతో కొంత ఉపశమనం పొందారు. అక్కడక్కడా మామిడి పిందెలు నేలరాలాయి. పొలాల్లో ఉన్న తీసిన నువ్వు పంట, ధాన్యంపై రైతులు టార్పాలిన్లు కప్పారు.


నందిగాంలో ధాన్యంపై కప్పిన టార్పాలిన్లు

వైసీపీతో రాష్ట్రం విచ్ఛిన్నం: అచ్చెన్నాయుడు


శ్రీకృష్ణాపురంలో ముస్లిం మహిళలతో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

సంతబొమ్మాళి: గడచిన ఐదేళ్లలో రాష్ట్రాన్ని వైసీపీ ప్రభుత్వం విచ్ఛిన్నం చేసిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. బుధవారం సాయంత్రం పాలతలగాం, శ్రీకృష్ణాపురం, ఉద్దండపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్క చాన్సంటూ అధికారంలోకి వచ్చిన జగన్ మరోసారి మాయ మాటలు చెబుతున్నాడని, వీటిని నమ్మవద్దన్నారు. చంద్రబాబు నాయ కత్వంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని, రానున్న ఎన్నికల్లో కూటమిని అధికారంలోకి తీసుకు రావాలని కోరారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. శ్రీకృష్ణాపురానికి చెందిన బాడాన మోహనరావు, వాన రామ్మూర్తి టీడీపీలో చేరగా వారికి అచ్చెన్నాయుడు కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాడాన వెంకటరమణమ్మ, టీడీపీ మండల కార్యదర్శి రెడ్డి అప్పన్న, కొర్రాయి రమేష్, కొర్రాయి అప్పన్న పాల్గొన్నారు.

జీడి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తాం: శిరీష



వజ్రపుకొత్తూరు: రానున్న ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం గెలిచిన వెంటనే జీడి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని కూటమి అభ్యర్థి గౌతు శిరీష అన్నారు. గరుడభద్ర గ్రామంలో బుధవారం ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. బడుగుల అభ్యున్నతికి, రైతులకు ఆదుకునేందుకు నిరంతరం కృషి చేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్‌నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సూరాడ మోహనరావు, కోనారి గణపతి, శశిభూషణ్ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన 50 వైసీపీ కుటుంబాలు


టీడీపీలో చేరిన వైసీపీ మాజీ సర్పంచ్ భాస్కరరావు తదితరులతో కలిశెట్టి అప్పలనాయుడు

జి.సిగడాం: పాలఖండ్యాం వైసీపీ మాజీ సర్పంచ్ పెద్ద భాస్కరరావు టీడీపీ తీర్థం పుచ్చు కున్నారు. ఆయనతో పాటు పలువురు నేతలు, 50 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరగా వారికి విజయనగరం ఎంపీ ఉమ్మడి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు కండువాలు వేసి ఆహ్వానించారు. ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని అప్పలనాయుడు కోరారు. కార్యక్రమంలో నాయకులు బి.వెంక టేశ్వరరావు, పలిశెట్టి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బండిపాలేనికి చెందిన 50 కుంటుంబాలు..


టీడీపీ కండువాలు వేసి ఎన్‌డీఏలోకి ఆహ్వానిస్తున్న ఎన్ఈఆర్

రణస్థలం: రణస్థలం పంచాయతీ పరిధి బండిపాలేనికి చెందిన 50 వైసీపీ కుటుంబాలు సర్పంచ్ పిన్నింటి భాను, మజ్జి వెంకటరమణ, మాజీ సర్పంచ్ రమణయ్య, కెల్ల హేమంతు కుమార్ ఆధ్వర్యంలో బుధవారం టీడీపీలో చేరారు. వీరికి ఎన్‌డీఏ కూటమి ఎచ్చెర్ల అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు టీడీపీ కండువాలు వేసి ఆహ్వానించారు. ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కలిశెట్టిని గెలిపించాలని, కమలం, సైకిల్ గుర్తులపై ఓట్లు వేయించాలని కోరారు. యువతను అన్ని విధాలా ఆదుకుంటానని భరోసా ఇచ్చారు.

వైశ్య సంఘం నేతలు..


ఎంపీ సమక్షంలో టీడీపీలో చేరిన వైశ్యసంఘం నాయకులు

సోంపేట: పట్టణానికి చెందిన వైశ్య సంఘం నేతలు టీడీపీలో చేరారు. బుధవారం ఎమ్మెల్యే అశోక్ నామినేషన్‌కు వచ్చిన ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీలో చేరిన వారిలో పట్టణానికి చెందిన మల్లా నాగేశ్వరరావు, మల్లా బాబూరావు, కొంచాడ శ్రీనివాసరావు, కొత్తకోట సంతోష్‌తోపాటు మరో 20 మంది ఉన్నారు. కార్యక్రమంలో నేతలు చిత్రాడ శ్రీనివాసరావు, బెల్లాన శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో 80 కుటుంబాలు చేరిక

లావేరు: మండలం వెంకటాపురం, వెంకటాపురం కాలనీకి చెందిన వైసీపీ, టీడీపీలకు చెందిన 80 కుటుంబాలు బుధవారం కాంగ్రెస్‌లో చేరాయి. వీరికి ఎచ్చెర్ల కాంగ్రెస్ అభ్యర్థి కరిమజ్జి మల్లేశ్వరరావు కండువాలను కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ పేదల పాలిట పెన్నిధి లాంటిదని, కాంగ్రెస్‌కు జీవం పోద్దామనే సదుద్దేశంతో పార్టీలో చేరామని వారు పేర్కొన్నారు.

కొత్తమ్మతల్లి ఆలయంలో ఎంపీ పూజలు



టెక్కలి: ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, సతీమణి శ్రావ్యతో కలిసి బుధవారం నామినేషన్ వేసేందుకు శ్రీకాకుళం వెళుతూ ముందుగా స్వగ్రామమైన నిమ్మాడలో గ్రామ దేవత అమ్మవారిని, కోటబొమ్మాళిలోని కొత్తమ్మ తల్లిని దర్శించుకొని నామినేషన్ పత్రాలుంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆ పత్రాలపై సంతకం చేశారు. కార్యక్రమంలో దివంగత నేత ఎర్రన్నాయుడు సతీమణి విజయలక్ష్మి, హరి వరప్రసాద్, అచ్చెన్నాయుడు భార్య విజయమాధవి, బోయిన గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

రామయ్యపుట్టగలో హారతులిచ్చి..



కవిటి: ఇచ్ఛాపురం నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థిగా బెందాళం అశోక్ నామినేషన్ వేసేందుకు బుధవారం స్వగ్రామం రామయ్య పుట్టుగలో బయలుదేరగా టీడీపీ కార్యకర్తలు, నేతలు ఆయనను అభి నందించారు. స్వగృహం వద్ద మహిళలు కుంకుమ బొట్టు పెట్టి హారతులిచ్చి విజయం చేకూరాలని ఆకాంక్షించారు. అనంతరం ర్యాలీగా ఇచ్ఛాపురం బయలుదేరి వెళ్లారు.

ఎంజీఆర్‌కు సీనియర్ నేతల మద్దతు


టీడీపీ నేతలతో కూటమి అభ్యర్థి గోవిందరావు

పాతపట్నం: కూటమి అభ్యర్థిగా టీడీపీ తరఫున పోటీ చేస్తున్న మామిడి గోవిందరావుతోనే మా ప్రయాణమని చిన్నమల్లిపురం పంచాయతీ టీడీపీ సీనియర్ నేతలు అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో మామిడి గోవిందరావును సీనియర్ నాయకులు మల్లిపురం హరి కృష్ణ, లోవ నీలకంఠం, లోవ కరువు, లోవ సింహాచలం, కోకడ పోలయ్య మల్లిపురం పోలయ్య జన్ని పోలయ్య తదితరులు కలిసి మద్దతు తెలిపారు. ఎన్నికల్లో చేపట్టాల్సిన ప్రచారాలపై ఆయనతో చర్చించారు.

చంద్రబాబు సమక్షంలో చేరిన వైసీపీ నేతలు


టీడీపీలో చేరిన వైసీపీ సీనియర్ నేతలు తమ్మినేని భూషణరావు, పంగ బావాజీ నాయుడులకు కండువాలు వేసి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

నరసన్నపేట/పోలాకి: నరసన్నపేట నియోజకవర్గ వైసీపీ నాయకులు ఆ పార్టీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పోలాకి మండల మాజీ ఎంపీపీ తమ్మినేని భూషణరావు, ఇటీవల పార్టీలో చేరిన డీసీసీబీ మాజీ అధ్యక్షుడు డోల జగన్, వెలమ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ ప్రతినిధి పంగ బావాజీనాయుడు, జలుమూరు జడ్పీటీసీ ప్రతినిధి మెండ రాంబాబులకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఎమ్మెల్యేగా బగ్గు రమణమూర్తి, ఎంపీగా కింజరాపు రామ్మోహన్ నాయుడు గెలుపునకు మరింత కృషి చేసి అత్యధిక మెజార్టీతో తనకు కానుకగా ఇవ్వాలని వారికి చంద్రబాబు సూచించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్ నాయుడు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కూన రవి కుమార్, నరసన్నపేట అభ్యర్థి బగ్గు రమణమూర్తి పాల్గొన్నారు.

వనితమండలం నుంచి...


టీడీపీలో చేరిన వారితో రమణమూర్తి

వనితమండలం(పోలాకి): వనితమండలం, జొన్నాం గ్రామాల నుంచి సుమారు 50 వైసీపీ కుటుంబాలు బుధవారం టీడీపీలో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కండువాలు వేసి ఆహ్వానించారు. వైసీపీని నమ్ముకున్న మాకు అన్యాయం జరిగిందని, అందుకే టీడీపీలో చేరామన్నారు. రానున్న ఎన్నికల్లో బగ్గు విజ యానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నేతలు ఎంవీ నాయుడు, సునీల్, బైరి భాస్కరరావు, రాజు పాల్గొన్నారు.

ఆదిత్యాలయంలో 'ధర్మపథం'



అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి దేవస్థానం అనివెట్టి మండపంలో ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో బుధవారం ధర్మపథం కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీ హిరణ్మయి నృత్యాలయ కళాకారుల కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఈవో ఎస్.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బకు గుర్తు తెలియని మహిళ మృతి



జి.సిగడాం: వడ దెబ్బకు గుర్తుతెలియని సుమారు 52 ఏళ్ల మహిళ బుధవారం మృతి చెందింది. ఆమె మెట్టవలస కూడలిలోని బస్టాండ్ వద్ద మధ్యాహ్నం స్పృహ తప్పి ఉండడాన్ని స్థానికులు గుర్తించి 108లో రాజాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహం ఆసుపత్రి మార్చురీలో ఉందని సమాచారం కోసం స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వై.మధుసూదనరావు పేర్కొన్నారు.

కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర



టెక్కలి: దేశ సరిహద్దులో సైనికులు చేస్తున్న త్యాగాలకు స్ఫూర్తిగా ప్రజలు వారికి మద్దతు తెలపాలని కోరుతూ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేపట్టినట్లు యూపీకి చెందిన దేశభక్తి శివకరన్ సింగ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన టెక్కలి చేరుకోగానే వారికి బీజేపీ, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ ప్రతినిధులు ఆశ్రయం కల్పించారు. తమ్మినేని ఆనందరావు, గేదెల చంద్రశేఖర్, హనుమంతు ఉదయభాస్కర్ తదితరులు ఆయనకు విశ్రాంతి సౌకర్యాలు కల్పించారు. శివకరన్ సింగ్ 2022 మార్చి 25న యూపీలో బయలుదేరారు. నవంబరు 30 నాటికి కాశ్మీర్‌కు, అక్కడ నుంచి బయలు దేరి మరో ఆరు నెలల్లో కన్యాకుమారి చేరుకుంటానన్నారు.

కలమటకు అభినందనలు

కొత్తూరు: టిడిపి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ మూర్తిని పలువురు నేతలు, కార్యకర్తలు కలిసి అభినందించారు. మాతల గ్రామంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో బుధవారం హడావుడి కనిపించింది. నియోజకవర్గానికి చెందిన క్యాడర్ చేరుకుని అభినందనలు తెలిపారు.


కలమటను అభినందిస్తున్న నేతలు

లింగ నిర్ధారణ చేస్తే చర్యలు తప్పవు: డీఎంహెచ్‌వో

అరసవల్లి: లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి హెచ్చరించారు. బుధవారం నగరంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులలో ఆకస్మికంగా తనిఖీలను నిర్వహించారు. స్కానింగ్ కేంద్రాల్లో చట్ట ఉల్లంఘనలు జరిగితే చర్యలు తీసుకుంటా మన్నారు. 5 ఏళ్లు దాటిన ఆసుపత్రులు, ల్యాబ్‌లు, డెంటల్ క్లినిక్‌లు, ఫిజియో థెరపీ క్లినిక్‌లను రెన్యువల్ చేయించుకోవాలని, లేకుంటే తగు చర్యలు తీసుకో వడం జరుగుతుందన్నారు. జిల్లా ఆర్‌బీఎస్‌కె కోఆర్డినేటర్ సీపీ శ్రీదేవి, డా.జీవీ లక్ష్మి, డీపీఎంవో పైడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి: త్రినాథ్

కాశీబుగ్గ: ఒక్క అవకాశం ఇవ్వండి.. పలాస నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని పలాస కాంగ్రెస్ అభ్యర్థి మజ్జి త్రినాథ్ బాబు అన్నారు. బుధవారం కాశీబుగ్గలో విలేకరులతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అనేక సమస్యలు పరిష్కారం కాకుండా ఉండిపోయాయని, గత ప్రభుత్వాలు వీటిని పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. జీడి, కొబ్బరికి ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయిస్తామన్నారు. వలసల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. శివారు ప్రాంతాలకు సాగునీటి కల్పనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత డాక్టర్ జీవితేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోనారి మోహన్‌రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, కాంగ్రెస్ నాయకులు రాజారావు, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సిగ్నల్ పాయింట్ల వద్ద గ్రీన్ షేడ్ నెట్ ఏర్పాటు


మిల్లు జంక్షన్‌లో ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఏర్పాటు చేసిన గ్రీన్ షేడ్ నెట్

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రంలో భానుడి తీవ్రతతో ఇబ్బందులు పడు తున్న వాహనదారులకు ఊరట కలిగించేందుకు నగర పాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా చర్యలు చేపట్టారు. పట్టణంలోని కూడళ్ల వద్ద సిగ్నల్ కోసం వేచి ఉండాల్సిన సమయంలో ఎండ తగుల కుండా ఉండేందుకు ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ల వద్ద గ్రీన్ షేడ్ నెట్‌లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధుల సహకారంతో వీటిని ఏర్పాటు చేశామని, కొంతమేర వాహన దారులకు వేసవి ఉపశమనం కలుగుతుందన్నారు.

మంత్రి సీదిరిని ఓడించడమే అజెండా

పలాస: మంత్రి అప్పలరాజును ఓడించడమే అజెండా అని టీడీపీ కాళింగ సంక్షేమ సంఘం నాయకులు స్పష్టం చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు ఆధ్వర్యంలో దువ్వాడ శ్రీకాంత్, దువ్వాడ హేమబాబు చౌదరి, పైల చక్రధర్ తదితరులు బుధవారం అత్య వసర సమావేశం నిర్వహించి చర్చించారు. గురువారం అన్ని వార్డుల్లో పర్యటిస్తూ వైసీపీ క్యాడర్‌తో పాటు అసమ్మతి నాయకులను కలుసుకొని 'మంత్రిని ఎందుకు ఓడించ కూడదు' అనే నినాదంతో ప్రచారం చేపడతామన్నారు. గడిచిన ఐదేళ్లలో కాళింగులను అణగదొక్కే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఎమ్మెల్యేగా శిరీష, ఎంపీగా రామ్మోహన్‌నాయుడుల విజయానికి అహర్నిశలు కృషి చేస్తామని పేర్కొన్నారు.